
శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నష్టపరిహారం పెంపు పై ప్రభుత్వానికి నివేదిస్తా

### జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్



**చేజర్ల అక్టోబర్ 18 ప్రభాతవార్త** ఎంతోకాలంగా ఫెండింగ్‌లో ఉన్న నడికుడి కాళహస్తి రైల్వే లైన్ భూసేకరణ పనులపై రైతులకు సంబందించి నష్ట పరిహారం పెంపు పై ప్రభుత్వానికి నివేదిస్తానని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పేర్కొన్నా. ఈ సందర్భంగా చేజర్ల మండలంలోని పెరుమాళ్ళపాడు గ్రామంలో శుక్రవారం కలెక్టర్ పర్యటించి రైల్వేలైనుకు సంబందించి అవార్డు అయిన భూ యజమాన రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పెరుమాళ్ళపాడు గ్రామ రైతులు తమగోడును జిల్లా కలెక్టర్ దృష్టికి తెలియజేశారు. మేము భూములనే నమ్ముకొని బ్రతుకుతున్నామని రెండు పంటలు పండే సారవంతమైన భూములు ప్రభుత్వం తక్కువధర నష్టపరిహారం కింద నిర్ణయించడంతో తాము తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ఇక్కడ ఒక ఎక్కరా భూమి 10 లక్షలపైన ధర పలుకుతుందని ప్రభుత్వం ఒక్క ఏకరాకి మాకు నష్టపరిహారం ఐదు లక్షల రూపాయాలు మాత్రమే ఇస్తుందని రైతులు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ నడికుడి కాళహస్తి రైల్వేలైన్ భూసేకరణలో రైతుల ఇబ్బందులను నేరుగా వారి ద్వారా తెలుసుకునేందుకు వచ్చామని అన్నారు. మీ అభిప్రాయాలను మీ అబిష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొవెళ్తానని రైతులకు తెలిపారు. అదేవిధంగా భూములు టైటిల్ విషయంపై తగాదాలు ఉంటే కేసులో అధారిటి నిర్ణయం మేరకు చెల్లింపులు జరుగుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ అధికారిణి బి.పావని, ఇన్‌చార్జి తహసిల్దారు మస్తానయ్య, ఇన్‌చార్జి ఎంపిడిఒ విజయలలితా, తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు కొమ్మి సిద్దుల నాయుడు, తలపనేని జయంతుల నాయుడు, మండల అధికారులు పాల్గోన్నారు.

## ముఖ్యమంత్రి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, అక్టోబరు 18 ప్రభాతవార్త** శుక్రవారం అమరా వతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమా వేశంలో కావలి ఎమ్మెల్యే దగు మాటి వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మె ల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## వరి విత్తన వ్యాపారస్తులపై విజిలెన్స్ అధికారులు దాడులు



**అల్లూరు, అక్టోబరు 18 ప్రభాతవార్త** అల్లూరులోని వరి విత్తన వ్యాపారస్తులపై విజిలెన్స్ ఎస్పీ రాజేంద్రకుమార్ ఆకస్మిక దాడులు నిర్వహించారు. అల్లూరు నుండి వరి విత్తనాలతో వెళ్తున్న లారీ లోడును చెన్నైలో సీజ్ చేశారు. ఆ విత్తనాలను ఎక్కడ కొనుగోలు చేశారని విచారించగా అల్లూరు లో కొనుగోలు చేశామని లారీ డ్రైవర్ చెప్పారు. దీంతో అల్లూరు నార్తుమోపూరులోని ఎ.రాఘవరెడ్డి విత్త నాల గోడౌన్‌ను, అల్లూరులో కొడమేకల మాలకొండయ్య విత్తనాల గోడౌన్‌లో, అల్లూరుపేటలో మాధవయ్య రైస్ మిల్ గోడౌన్‌లో వరి విత్తనాలు పరిశీలించి సరైన పత్రాలు లేవని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రైతులకు నకిలీ వరి విత్తనాలు అమ్మితే ఉపేక్షించేది లేదని అధికారులు హెచ్చరికలు చేశారు. వీరి వెంట కావలి ఎడిఎ నాగరాజు, ఎవో వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## కావలి మున్సిపాల్టీలో చౌదరిపాళెం విలీనం రద్దుకు రంగం సిద్ధం



**కావలి, అక్టోబరు 18 ప్రభాతవార్త** కావలి మున్సి పాల్టీ పరిధిలోకి చౌదరిపాళెం గ్రామాన్ని విలీనం చేసేందుకు గత వైసిపి పాలకులు తీసుకున్న నిర్ణయాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకుంటూ మున్సి పల్ శాఖకు ప్రతిపాదనలు పంపారు. చౌదరిపాళెం గ్రామాన్ని మున్సి పాల్టీలో విలీనం చేయవద్దని గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించడం తెలిసిందే. ఈ వివాదం వల్ల కావలి మున్సి పల్ ఎన్నికలు వాయిదా పడ్డాయి. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చౌదరిపాళెం గ్రామ విలీనాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు మున్సి పల్ అధికారులు ఇటీవల ప్రతిపాదనలు పంపారు కూడా. చౌదరిపాళెం విలీనం రద్దయితే ఇక మున్సి పల్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ లభిస్తుంది. మున్సి పల్ ఎన్నికలకు కౌన్సి లర్లుగా పోటీ చేసే ఆశావాహులు రంగం చేసుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

## జడ్పి చైర్ పర్సన్‌ని కలిసిన డ్వామా పిడి గంగా భవాని



**నెల్లూరు అర్బన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్స న్ ఆనం అరుణమ్మని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డ్వామా పిడి బి. గంగాభవాని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. అనంతరం పలు అంశాలపై ఇరువురు చర్చించారు.

## ఆక్రమణ స్థలాన్ని పరిశీలించిన ఈవోపీఆర్డీ



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలం ఆక్రమణలకు గురైందని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు శుక్రవారం ఈవోపీఆర్డీ శ్రీనివాసులు ఆ ప్రాంతానికి వెళ్లి ఆర్‌అండ్‌బీ స్థలం ఆక్రమణలకు గురైన విషయాన్ని నిశిత పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

## రీసర్వే రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త** మండల దండిగుంట పంచాయితీలో భూములకు సంబంధించి రీ సర్వే కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయడం జరుగుతుందని తహశీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. ప్రతి రైతు వారి భూముల సంబంధించి సమస్యలను తెలుసుకోవాలంటే గ్రామ సభకు హాజరై పరిష్కారం చేసుకోవాలని తెలిపారు.

## సోమశిల జలాశయానికి పెరుగుతున్న వరద ప్రవాహం



**అనంతసాగరం, అక్టోబర్18 ప్రభాత వార్త:** కురుస్తున్న వర్షాలకు మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 33,891 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం క్రమేపీ పెరుగుతూ ఉంది. జలాశయం పూర్తిసామర్ధ్యం 78టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో 57.036 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్‌ఎఫ్‌సికి 5, ఎన్‌ఎఫ్‌సికి 40, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు వెయ్యి క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు జలాశయం అధికారులు తెలిపారు.

## అపరిష్కృతంగా ఉన్న శ్రీకాళహస్తి రైల్వే లైను భూసేకరణ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆనంద్



**పొదలకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త** అపరిష్కృతంగా ఉన్న శ్రీకాళహస్తి రైల్వే లైను భూసేకరణ పనులను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ పేర్కొన్నారు. పొదలకూరు మండల అంకుపల్లి, చేజర్ల మండలం పెరుమళ్ళపాడు, ఆత్మకూరు మండలం అప్పారావుపాలెం గ్రామాల్లో జిల్లా కలెక్టర్ పర్యటించి రైల్వే లైనుకు సంబంధించి అవార్డు ఆయన భూ యజమానులు, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అంకుపల్లి గ్రామ రైతులు తమ గోడును జిల్లా కలెక్టర్‌కు వివరిస్తూ, భూములను అవార్డు చేసే సమయంలో రెండు పంటలు పండే సారవంతమైన భూములకు అది తక్కువ ధర నిర్ణయించినందుకు తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. అదే విధంగా ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మామిడి చెట్లకు నిమ్మ తోటలకు కనీస ధర చెల్లించడం లేదని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తమ గ్రామానికి ఆనుకొని ఉన్న వామిడపర్తి గ్రామ రైతులకు చెల్లించిన ధరను తమకు కూడా వర్తించే విధంగా చూడాలని కోరారు. చేజర్ల మండల పెరుమళ్ళపాడు గ్రామ రైతులు మాట్లాడుతూ చిన్న చిన్న కమతాలు ఉన్నటువంటి రైతులు అనేకమంది ఉన్నామని, వారందరికీ మేలు చేకూర్చే విధంగా నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆత్మకూరు మండలం అప్పారావు పాలెం గ్రామ రైతులు మాట్లాడుతూ కేవలం ఒక కిలో మీటర్ పరిధిలో పిల్లర్లు వేసి రైల్వే లైను నిర్మిస్తే తమ గ్రామంతో పాటు పరిసరి నాలుగు గ్రామాల ప్రజలకు వరదల సమయంలో మునిగిపోకుండా ఉంటాయన్నారు. అదే విధంగా మాగాణి భూములను మెట్ట భూములుగా రికార్డుల్లో చూపినందున, నష్టపరిహారం అందుకునే సమయంలో తాము తీవ్రంగా నష్టపోతామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైను భూసేకరణలో రైతులకు చెల్లింపులు చేయడానికి గల ఇబ్బందులను నేరుగా వారి నోటి నుండి తెలుసుకునేందుకు వచ్చామన్నారు. వారి అభిప్రయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. అదే విధంగా భూముల టైటిల్ విషయమై తగాధాలు ఉన్నటువంటి కేసుల్లో అథారిటీ నిర్ణయించిన మేరకు చెల్లింపులు జరుగుతాయన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ సమయంలో భూముల ధరలు తక్కువగా చూపడంతో నష్టపరిహారం కూడా తక్కువగా అందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వెల్లడించిన అన్ని వివరాలు ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, ఆత్మకూరు ఆర్‌డిఓలు అనూష, పావని, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## రైల్వేలైన్ భూసేకరణ నిర్వాసితులకు న్యాయం చేస్తాం : జిల్లాకలెక్టర్ ఓ.ఆనంద్



**ఆత్మకూరు, అక్టోబర్18, ప్రభాతవార్త :** జిల్లాలో చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న నడికుడి శ్రీకాళహస్తి రైల్వే లైన్ భూసేకరణ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం గ్రామంలోని రైల్వేలైన్ భూసేకరణ నిర్వాసితులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. నడికుడి శ్రీకాళహస్తి భూసేకరణతో రైతులకు చెల్లింపు లు చేయడానికి గల ఇబ్బందులను నేరుగా తెలుసుకోవాలనే తాను వచ్చానన్నారు. నిర్వాసితుల వెల్లబుచ్చిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అదే విధంగా భూముల టైటిల్ విషయమై తగాదాలున్న కేసుల్లో అథార్టీ నిర్ణయించిన మేరకు చెల్లింపులు జరుగుతాయన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో భూముల ధరలు తక్కువగా చూపడంతో నష్టపరిహారం చెల్లింపు సమయంలో నిర్వాసిత రైతులకు తక్కువ పరిహారం అందే అవకాశం ఉంటుందన్నారు. రైతులు వెల్లడించిన అన్ని వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిర్వాసితులు నష్టపోకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అప్పారావుపాళెం రైతులు కేవలం ఒక కిలోమీటరు పరిధిలో పిల్లర్లు వేసి రైల్వేలైన్ నిర్మిస్తే తమ గ్రామంతోపాటు పరిసర నాలుగు గ్రామాల ప్రజలకు వరదల సమయంలో మునిగిపోకుండా ఉంటాయన్నారు. మాగాణి భూములను మెట్ట భూములుగా రెవెన్యూ రికార్డుల్లో చూపినందున నష్టపరిహారం అందుకునే ఈ సమయంలో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటిపై సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన రైల్వే లైన్ నిర్వాసితులకు పరిహారం అందించేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావని, రెవెన్యూ అధికారులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఎల్.టి.పి.ఎల్ ప్లానింగ్ లో నిబంధనలో తప్పనిసరిగా పాటించాలి కమిషనర్ సూర్య తేజ



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాలకు లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ కార్పొరేషన్ భవన అనుమతుల కొరకు పొందపరచవలసిన పత్రములు అన్నియు తప్పనిసరిగా సమర్పించి తద్వారా కార్పొరేషన్ వారి అనుమతి పొందిన పిమ్మట భవన నిర్మాణం మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలని తదుపరి నగరపాలక సంస్థ వారి అనుమతుల ప్రకారం నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలని అలా కార్పొరేషన్ వారి ఉత్తర్వులు ఉల్లంఘించిన నిర్మాణాల పై చర్యలు తీసుకుం టామని కమిషనర్ సూర్య తేజ స్పష్టం చేసారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో టౌన్ ప్లానింగ్ ఎల్.టి.పి లతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందిన భవన యజమానులు నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టేలా, వర్షపు నీరు భూమిలో ఇంకేలా ఇంకుడుగుంట తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలని, అనుమతి పొందిన భవన నిర్మాణం జరగకుండా, రోడ్లను అక్రమిస్తూ మెట్ల, ర్యాంపులు నిర్మాణం జరగకుండా, వర్షపు నీరు డ్రైన్ కాలువలు ద్వారా సాఫీగా ప్రవహించుటకు వీలుగా రూపొందించి, నిర్మాణాలను పరిశీలించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన నిర్మాణాలను అన్ని భవన సబుదాయాల్లో ప్రణాళికాబద్ధంగా జరిగేలా జాగ్రత్తలు వహించాలని కమిషనర్ ఆదేశించారు. నూతన భవనాల నిర్మాణాల అనుమతులకు దరఖాస్తు చేసే సమయంలోనే ఏలాంటి ఉల్లంఘనలు లేకుండా సరి చూసుకోవాలని, నిబంధనలు అతిక్రమించిన నిర్మాణాలను పరిశీలించి తప్పనిసరిగా ఆక్రమణలను తొలగించేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులకు ఇదివరికే ఆదేశించియున్నామని కమిషనర్ స్పష్టం చేసారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, దశయ్య నుడా పి.ఓ సుబ్బారావు నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గిన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో వ్యర్ధాలు వేస్తే జరిమానాలు విధించండి : కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** నెల్లూరు నగరవ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా నిర్వహించే క్రమంలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్ధాలు వేసేవారని గుర్తించి జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో పారిశుద్ధ్య విభాగంతో సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కమర్షియల్ ప్రాంతాల్లోని కార్యదర్శులు వ్యర్ధాలను రోడ్ల పై వేస్తున్న వారిని గుర్తించి ఎక్కువ సంఖ్యలో జరిమానాలు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రజల్లో నిర్లక్ష్య ధోరణి వదిలేంతవరకు క్రమం తప్పకుండా జరిమానాలను విధుస్తూనే ఉండాలని సూచించారు. శానిటేషన్ కార్యదర్శులంతా ప్రతి రోజు ఫీల్డ్ విజిట్ చేయాలని, పారిశుద్ధ్య సమస్యలను గుర్తించి కబాంబ్ కంట్రోల్ కేంద్రానికి తెలియజేయాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతిరోజు మొబైల్ ఆధారిత హాజరు వేయించాలని, విధి నిర్వహణలో రక్షణా ఉపకరణాలు తప్పనిసరిగా వినియోగావచేలా పర్యవేక్షించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత డివిజన్లలోని కార్యదర్శులు, సిబ్బంది పై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత పనులను, సిల్ట్ తొలగింపు పనులను ప్రతిరోజూ క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. పరిసరాల పరిశుభ్రత కోసం నగర పాలక సంస్థలో అందుబాటులో ఉన్న అన్ని వాహనాలు, యంత్రాలకు మరమ్మతులు చేసి పూర్తి స్థాయిలో వినియోగించుకుని చ్కటి ప్రణాళికతో పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రచార పోస్టర్లు, భవన నిర్మాణ వ్యర్ధాలను రోడ్ల పై తొలగించేందుకు అవసరమైన ఇతర విభాగాల కార్యదర్శులను కూడా సమన్వయం చేసుకుంటూ డివిజన్ల వారీగా మార్పు తీసుకరావాలని కమిషనర్ ఆదేశించారు. పరిశుభ్రంగా ఉంచుకోని ఖాళీ ప్లాట్ల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేసి, ప్లాట్లను శుభ్రంగా ఉంచుకునేలా చర్యతు తీసుకోవాలని సూచించారు. నగర వ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణకు అధునాతన మానవ రహిత వాహనాలు, యంత్రాలు కూడా నగరపాలక సంస్థలో అందుబాటులో ఉన్నాయని వాటి సేవలను అవసరమైన అన్ని ప్రాంతాల్లో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్ధాల నియంత్రణకు డ్రైను కాలువల్లో అక్కడక్కడా జల్లెడ ఏర్పాటును చేయాలని, ఏ ప్రాంతాల్లో అలాంటి ఏర్పాట్లు అవసరమున్నాయో వివరాలను తెలియజేయాలని కమిషనర్ కోరారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, డి.ఈ సాయిరాం, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సిబ్బంది శ్రమ ఎనలేనిది : విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్



**నెల్లూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** తుఫాను సహాయక చర్యల్లో తీసుకున్న చర్యలు, అందించిన సహాయ సహకారాలు ఎనలేనివని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ కొనియాడారు. విద్యుత్ భవన్‌లోని విజయన్ ఛాంబర్ నుండి జిల్లాలోని ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్, డిప్యూటీ ఇంజనీర్స్ అసిస్టెంట్, అసిస్టెంట్ ఇంజనీర్, అకౌంట్స్ విభాగాలతో టెలికాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని డివిజన్‌ల అధికారులు, సిబ్బందితుఫాన్ ముందస్తు చర్యలు చాలా భాగా తీసుకున్నారని ఎక్కడ ఏ అవసరం వచ్చిన వెంటనే విద్యుత్ పునరుద్దరించడానికి టీమ్స్ ఏర్పాటు చేసుకున్నామని, దాదాపు 700 మంది వర్కర్స్‌ను టీములుగా ఏర్పాటు చేసి సూళ్లూరుపేటలో తీరం దాటుతుందన్న హెచ్చరికలతో ముందుగానే టీమ్‌లను అధికారులను సూళ్లూరుపేటకు పంపడం జరిగిందన్నారు. అదే విధంగా పోల్స్ డ్రిల్లింగ్ మిషన్స్, పవర్ సాస్, లైట్స్ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ అధికారులకు, సిబ్బందికి, కాంట్రాక్టర్‌లకు సబ్ స్టేషన్ సిబ్బందికి, పాల్గొన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్క సర్వీసు బిల్డింగ్ ఐఆర్‌డీఏ స్కానింగ్ ద్వారా బిల్లింగ్ జరగాలని, అలా బిల్లింగ్ జరిగితే ఖచ్చితమైన రీడింగ్‌తో బిల్లు ఇవ్వవచ్చని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరు విద్యుత్ మీటర్‌ను బయట బిగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డివిజన్‌లో బకాయిలు చాలా ఎక్కువగా ఉన్నాయని, బకాయిలు వెంటనే వసూళ్లు చేయాలని ఆదేశించారు. డీసీలిస్ట్ పక్కాగా చేయాలని లేనిచో చర్యలు తప్పవని తెలిపారు. డిసి లిస్టు గడువులోగా పూర్తి చేసి రెవెన్యూ కార్యాలయానికి పంపని యెడల వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎస్ఈకి ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి పాల్గొన్నారు.

## బంగారు దుఖాణంలో దొంగతనానికి ప్రయత్నం విఫలం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ రాంబాబు, ఎస్ఐ హనీఫ్



**పొదలకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలోని ప్రధాన రహదారిలోని ఓ బంగారు నగల దుకాణంలో దొంగతనానికి కొందరు వ్యక్తులు ప్రయత్నించారు. ప్రధాన రహదారిలోని సన్నికంటి రాధయ్య అనే వ్యక్తికి చెందిన బంగారు దుకాణంలో గురువారం అర్ధరాత్రి కొందరు గుర్తు తెలియని దుండగులు దుకాణం వద్దకు చేరుకొని జాకీ పెట్టి దుకాణం షెట్టర్ తీయడానికి విశ్వ ప్రయత్నాలు చేశారు. బంగారు దుకాణానికి ఎదురెంటి మిద్దెపై నుండి కొందరు గమనించి అరవడంతో జాకిని, గడ్డపారను వదిలేసి దుండగులు అక్కడ నుండి పరారయ్యారు. దీంతో దుకాణం యాజమానికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిఐ రాంబాబు, ఎస్ఐ హనీఫ్‌లు సంఘటన ప్రదేశానికి చేరుకొని దొంగతనం జరగబోయిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేర నియంత్రణ కోసం మండలంలో 156 సిసి కెమెరాలు ఏర్పాటు సిఐ ఆర్. రాంబాబు, ఎస్ఐ హనీఫ్



**పొదలకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** నేర నియంత్రణ కోసం ఎన్నడూ లేని విధంగా గ్రామ స్థాయి నుంచే చర్యలు చేపట్టేందుకు ఏపీ ప్రభుత్వం పోలీసు శాఖ సన్నాహాలు చేస్తోందని ఇందులో భాగంగా పొదలకూరు మండలంలో, 156 లోకేషన్స్‌లో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పొదలకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, మెయిన్ రోడ్డు, పంచాయితీ బస్టాండులో వున్న పలు దుకాణదారుల యజమానులతో క్రైమ్ ప్రివెన్షన్ - డిటెక్షన్‌పై ఎస్ఐ హనీఫ్‌తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఆర్. రాంబాబు మాట్లాడుతూ త్వరగా ఏపీ ప్రభుత్వం, పోలీసు శాఖ నేర నియంత్రణ కోసం గతంలో ఎన్నడూ లేని విధంగా తాము ప్రతిపాదించిన ప్రతి గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దొంగతనాలు, నేరాలు, అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు ప్రధాన ఆధారంగా సిసి కెమెరాలు ఉపయోగపడుతాయన్నారు. రాత్రుళ్లు దొంగతనాలు జరుగుతున్నాయని, షాపింగ్ మాల్స్, జ్యువలరీ షాప్స్, ఫంక్షన్ హాల్స్, ఇతర వ్యాపార సంస్థల వద్ద షాపు లోపల, బయట రోడ్డు కనిపించే విధంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సిసి కెమెరాలు ఏర్పాటుతో లభించే క్లూస్ ద్వారా కేసుల ఛేదన కూడా త్వరిగతిన సాధ్యపడుతుందన్నారు. అలాగే శుక్రవారం పొదలకూరు మెయిన్ రోడ్డుపై సన్నికంటి రాధయ్య షాపులో చోరియత్నం కేసును త్వరలోనే ఛేదిస్తామన్నారు. ఇప్పటికే సంఘటన స్థలాన్ని పరిశీలించి ఫింగర్ ప్రింట్స్‌తో పాటు, తగిన ఆధారాలు సేకరించాలని, వారిని పట్టుకోవడానికి రెండు టీంలు పనిచేస్తున్నాయన్నారు. దుకాణదారులు అప్రమత్తంగా ఉండటమే ఉత్తమమైన లక్షణం అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు దుకాణాల యాజమానులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరి వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే



**వింజమూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** వింజమూరులోని మద్దూరి చెన్నారెడ్డి-సులోచనల కుమారుడు మద్దూరి సాయిచరణ్ రెడ్డి -బయపురెడ్డి సుబ్బారెడ్డి-వెంకటరమణమ్మల కుమార్తె సుస్మిత ల వివాహానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపిటిసి సభ్యురాలు వనిపెంట హైమావతి, వెంకటసుబ్బారెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సిసిరోడ్డుకు శంఖుస్థాపన



**వింజమూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త:** వింజమూరు మండలం ఊటుకూరు పంచాయతీలోని జువ్విగుంటపాళెంలో శుక్రవారం సిసిరోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎంపిటిసి సభ్యులు గురజాల వెంకటరమణయ్యల ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ రొడ్డా వెంగమ్మ శంఖుస్థాపన గావించారు. జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో సిసిరోడ్డు నిర్మాణానికి 8.80లక్షల రూపాయలు నిధులు మంజూరయ్యాయన్నారు. ఈనిధులతో నిర్మాణం చేపడతామన్నారు. ఈరోడ్డు నిర్మాణంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. గతంలో రోడ్డు సక్రమంగా లేక ప్రజలకు ఈ రహదారి అసౌకర్యంగా ఉందన్నారు. ప్రస్తుతం వేస్తున్న రోడ్డుతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలన్న పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి గ్రామంలో కనీస మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టికి ఉదయగిరి నియోజకవర్గ వెనుకబాటుతనాన్ని తీసుకెళ్ళి అధిక నిధుల మంజూరు కు కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఐదేళ్ళలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గోరంట్ల నాగభూషణం, వెంకటేశ్వర్లు, మాదినేని నాగేశ్వరరావ్, శ్రీనివాసులు, ఏగినేని శ్రీనివాసులు, తిరుపతాచారి, మహబూబ్‌బాషా, మాజీ ఎంపిటిసి రొడ్డా కొండయ్య, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మైపాడు, కోరుటూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**ఇందుకూరుపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని మైపాడు, కోరుటూరు గ్రామాల్లో ఇందుకూరుపేట వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ ఏ.రాజ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీ మీద బీపీటీ-5204 వరి విత్తనాలు వచ్చి ఉన్నాయని తెలిపారు. వీటి ధర రూ.1045, మనం ఇచ్చే ధర రూ.920 లు అని చెప్పారు. మట్టి నమూనాలు గురించి, వాటి ఉపయోగాల గురించి తెలియజేశారు. ఎంఏఓ డి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ కేఎన్ఎం-1638 వరి విత్తనం సబ్సిడీ మీద ఇస్తామని, కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలని రైతులకు తెలియజేశారు. వరి విత్తన శుద్ధి గురించి, నారు యాజమాన్యం గురించి రైతులకు తెలిపారు. చౌడు పొలాలకు, చౌడు నివారణకు జిప్సం వాడు విది విధానాల గురించి తెలియజేశారు. వెటర్నరీ డాక్టర్ అస్లాం మాట్లాడుతూ పశుగ్రాస సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గాలికుంటు వ్యాధికి టీకాలు అందుబాటులో ఉన్నాయని, టీఎంఆర్, గోకులం షెడ్లు వంటి పథకాల గురించి రైతులకు తెలియజేశారు. కిసాన్ కార్డులు గురించి కూడా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లు పెంచలయ్య, నరహరి తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే అభ్యంతరాలను పక్కాగా పరిష్కరించండి ..నేటి నుండి రీ సర్వేపై రెవెన్యూ సదస్సులు




**రాపూరు, అక్టోబరు18ప్రభాతవార్త:** రీ సర్వే జరిగిన గ్రామాలలో రీ సర్వేపై అభ్యంతరాల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని రాపూరు తహశిల్దార్ లక్ష్మీ నరసింహం కోరారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో రీ సర్వేలో ఎమైనా పొరపాట్లు సంబవించి వుంటే వాటిని పరిష్కరించేందుకు 19వ తేది శనివారం నుండి నవంబరు 14వ తేది వరకు రీ సర్వే జరిగిన గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సదస్సులలో రైతులు రీ సర్వేలో ఎటువంటి పొరపాట్లు జరిగివున్నా పరిష్కరించుకోవాలని కోరారు.రీ సర్వేపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో రైతుల నుండి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకుమండల సర్వేయర్,గ్రామ సర్వేయర్‌లు చర్యలు చేపట్టాలని నెల్లూరు డివిజనల్ సర్వేయర్ శ్రీనివాస మూర్తి కోరారు.రీ సర్వే అభ్యంతరాలపై నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల సందర్భంగా ఆయన శుక్రవారం రాపూరులో మండల సర్వేయర్‌తో కలసి గ్రామ సర్వేయర్‌లతో సమీక్ష నిర్వహించి రీ సర్వే అభ్యంతరాలపై తీసుకోవాల్చిన చర్యలపై అవగాహన నిర్వహించారు.

## గిరిజన మహిళ మృతిపై ఆత్మకూరు డిఏస్పీ విచారణ



**రాపూరు, అక్టోబరు18ప్రభాతవార్త:** గత వారంలో ఆత్మహత్య చేసుకోన్న గిరిజన మహిళ ఏకోలు చెంచులక్ష్మీ మృతిపై ఆత్మకూరు డిఏస్పీ వేణు గోపాల్ శుక్రవారం విచారణ నిర్వహించారు. రాపూరు పోలీసు స్టేషన్‌కు చేరుకున్న డిఏస్పీ చెంచు లక్ష్మీ మృతికి సంబంధించిన వివరాలను సిఐ విజయ కృష్ణ, ఎస్ఐ వెంకట రాజేష్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనస్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. నేరల నియంత్రణకు సంబందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన పోలీసుసిబ్బందికి సూచించారు. ఈయన వెంట సిఐ విజయ కృష్ణ,ఎస్ఐ వెంకట రాజేష్,పోలీసు సిబ్బంది వున్నారు.

## రైతులను ఆదుకోవడం వేమిరెడ్డి లక్ష్యం



**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** రైతన్నలను ఆదుకోవడంలో విపిఆర్ ఫౌండేషన్ ఎంతో సేవ చేస్తుందని మండల టిడిపి నాయకులు తాత రమేష్, తుళ్లూరు మాధవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరరెడ్డిపాలెం, రామతీర్థం రైతులకు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పూడికతీత కాలువ పనులకు శ్రీకారం చుట్టారని తెలియజేశారు. ఏడు సంవత్సరాల నుండి ఉన్న కాలువలు పూడిపోయి సాగునీరు సక్రమంగా అందడం లేదని ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి విపిఆర్ ఫౌండేషన్ ద్వారా పనులు చేయించడం ఎంతో సంతోషకరమైన విషయమని ఇలాంటి గొప్ప మనసున్న ఎమ్మెల్యే కోవూరు నియోజకవర్గంలో ఉండడం ప్రజల అదృష్టమని కొనియాడారు. చివరి ఆయకట్టు వరకు రైతన్నలకు సాగునీరుకి ఎలాంటి ఇబ్బందులు లేవని ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడ నరేంద్ర, రఘు, తిరుపతి, శ్రీనివాసులు, ఉప్పల వెంకటరమణయ్య, సీనయ్య, నాటూరు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన పంట పరిశీలన



**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మండలం ముదివర్తి గ్రామంలో కురిసిన వర్షాలకు గుండుబోయిన వెంకటేశ్వర్లు అనే రైతు పంట నీట మునగడంతో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి పరిశీలించడం జరిగింది. నష్టపోయిన రైతుకు నష్ట పరిహారం అందే విధంగా పూర్తి సమాచారం స్వీకరించడం జరిగిందని సహాయసంచాలకులు నర్సోజి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య, సిబ్బంది ఏ. సాయి లక్ష్మి పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తడే..



**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో సంఘ మిత్ర, విద్యాశాఖ కార్యాలయమునకు వెళ్లే దారి కురిసిన వర్షాలకు గుంతలపడి బురద మయంగా మారడంతో అటుగా వెళ్లే అధికారులు అనేక ఇబ్బందులు తప్పడం లేదు. చిన్నపాటి వర్షాలకు కూడా ఈ వీధి చిత్తడైపోతుంది. పరిపాలకులు, అధికారులు చొరవ చూపి మరమ్మత్తులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

## యోగా ట్రైనర్ పోస్టుకు ధరఖాస్తు చేసుకోంది

**జలదంకి, అక్టోబర్18,ప్రభాతవార్త:** స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వైద్యాదికారి విజయకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.కాంట్రాక్ట్ పద్దతిలో చేపట్టే ఈనియామకానికి సంబందించి యోగాలో సర్టిఫికేట్ల కోర్సులు పిజి,డిప్లమ చేసినవారు,లేక యోగ శిక్షణలో అనుభవం వున్నవారు అర్హులని డాక్టర్‌తెలిపారు.దీనికి స్త్రీ,పురుష అభ్యర్తులు ధరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.రోజుకు గంట చొప్పున నెలకు 32 గంటలు శిక్షణ ఇవ్వాల్సి వుంటుందని దీనికగాను గౌరవ వేతనం నెలకు 8వేలు స్త్రీలకు 5వేలు వుంటుందని తెలిపారు.కావున ఆశక్తి కలిగిన వారు ఈనెల 26వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.వివరాలకు 9553420555 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలని విజ్ఞప్తిచేశారు.

## ఇళ్ల మధ్యలో బ్రాందీ షాపు తొలగించండి మహాప్రభో..



**మనుబోలు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మనుబోలు కోదండరామపురం బీసీ కాలనీ వద్ద ఇళ్ల మధ్యలో ఉన్న బ్రాందీ షాపుపై మహిళలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఐదేళ్ల ప్రభుత్వ మద్యం దుకాణం కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం షాపు స్థానంలో ప్రైవేటు మద్యం షాపును కూడా ఇక్కడే కొనసాగిస్తున్నారు. మద్యం షాపు పక్కనే మసీదు, పోలేరమ్మ గుడి ఉన్నాయి. పలు కుటుంబాల వారు నివసిస్తున్నారు. నిత్యం మందుప్రియులు, తాగుబోతుల సంచారంతో ఇక్కడ పలు వీధుల్లో మహిళలు భయపడుతున్నారు. నిత్యం మందుబాబులు అరుపులు, కేకలు ఆగడాలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇల్లువాకిలి ముందే తాగి తూలిపడిపోతున్నారు. దీంతో స్థానికులు బ్రాందీ షాపుపైన ఆందోళన చెందుతున్నారు. ఇళ్ల మధ్యలో బ్రాందీ షాపు తీసేయాలని వైకాపా ప్రభుత్వంలో సమీపంలో ఉన్న ప్రసాద్ అనే వ్యక్తి పోరాటం చేశాడు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇక్కడ మద్యం షాపు కొనసాగిస్తుంటే ప్రసాద్ నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాడు. పిడూరు రోడ్డులో బ్రాందీ షాపు గ్రామానికి దూరంగా పొలాల మధ్యలో పెట్టుకోవచ్చని పలువురు సలహా ఇస్తున్నారు. ఇక్కడ బ్రాందీ షాపు తీసేయాలని ఇక్కడ ప్రజలంతా సంతకాలు సేకరించి జిల్లా కలెక్టర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి ఫిర్యాదు చేయాలని ప్రయత్నిస్తున్నారు.

## శంఖుస్ధాపన చేసిన సర్పంచ్ అమరేశ్వరి



**వలేటివారిపాలెం అక్టోబరు 18, ప్రభాతవార్త :** మండలంలోని పోలినేనిపాలెంలో రూ.17లక్షలతో సీసీ రోడ్లు నిర్మించనున్నారు.ఈ మేరకు 'పల్లె పండుగ కార్యక్రమం'లో బాగంగా శుకృవారం సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి శంఖుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అం తర్గత రోడ్ల నిర్మాణానికి ఈ నిధులు ఎంతో ఉప యోగపడనున్నట్లు తెలిపారు.గత కొంత కాలం గా ఈ సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందిఎదుతున్నారు .సీసీ రోడ్లును త్వరతిగతిన నిర్మించాల్సిందిగా ఆమె అధికారులుకు అమరేశ్వరి సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సీపీఎం నేత మాదాల రమణయ్య, తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం,టీఏ చిన్నయ్య,మహిళాపోలీస్ ప్రసన్నతోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగయ్య మృతికి వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి



**ఉలవపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యులు, మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులుగా తదనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ ఆవిర్భావం నుంచి మంచి సీనియర్ నాయకుడుగా సేవలు అందించిన ఆలూరు సింగయ్య స్వర్గస్తులైయ్యారని తెలిసి, భైతిక గాయాన్ని స్థానిక నాయ కులు చీమకుర్తి కృష్ణారెడ్డితో కలిసి ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు సన్నం పోతురాజు, మండల కోఆప్షన్ సభ్యులు ఎస్కే ఖాదర్ భాషా, స్థానిక వైఎస్సార్ కుటుంబ సభ్యులు సుబ్బారావు, అనురాధ కలిసి పార్థివదేహాన్నికి శ్రద్దాంజలి ఘటించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## గ్రామీణప్రాంతాల అభివృద్ధికి మహర్దశ



**వలేటివారిపాలెం అక్టోబరు 18, ప్రభాత వార్త:** తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మహర్దశ చేకూరనుందని మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం అన్నారు. ఇందులో బాగంగా మండలానికి రూ. 3 కోట్లు నిధుల మంజూరు అయ్యాయని తెలిపారు.శుకృవారం మండలంలోని అంక భూపాలపురం, లింగపాలెం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన కార్య క్రమం నిర్వహించారు.అంకభూపాలపురంలో తెదేపా నేతల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచన మేరకు ప్రభుత్వం అంకభూపాలపురం గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాటుకు రూ.10లక్షలు కేటాయించినట్లు తెలిపారు.ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శుకృవారం భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వహయాంలో పాదచారులు ప్రయాణానికి నరకం అనుభవించేవారని ఎద్దేవా చేశారు.రోడ్లు అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.తెదేపా ప్రభుత్వం రాగానే స్ధానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచన మేరకు గ్రామాల్లో అంతర్గత రోడ్లు అభివృద్ధికి ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరుచేసినట్లు తెలిపారు. ఇందులోబాగంగా పోకూరు,బడేవారిపాలెం,శాఖవరం గ్రామాల్లో సీసీ రోడ్లనిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారని తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల్లో అవసరమైన మేరకు రోడ్ల అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.సీనియర్ అడ్వకేట్ మరియు తెదేపా యూనిట్ ఇన్‌చార్జ్ ప్రగడ శ్రీనివాసులు మాట్లాడుతూ మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ప్రశంసనీయమన్నారు. అంకభూపాలపురంకు రూ.10లక్షలు కేటాయించడంపట్ల కృతజ్ఞతలన్నారు.తెదేపా క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకుమాని హర్ష మాట్లాడుతూ తెదేపా పాలనలో అని ్న వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం నేత సిరిగిరి కొండారెడ్డి,తెదేపా అంకభూపాలపురం నాయకులు ప్రగడ మోహన్‌కుమార్, బక్కముంతల మాల్యాద్రి,ఆర్ఎంపీ ప్రసాద్,బత్తుల మాధవరావు, సైదులు,పిన్నిక కృష్ణయ్య, పెగడ బలరామయ్య, రవి లక్ష్మినారాయణ,మంగి సురేష్, మల్లెల అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్ల నిర్మాణాల నిధుల వివరాలు

**వలేటివారిపాలెం అక్టోబరు 18, ప్రభాతవార్త :** మండలంలోని పలు గ్రామపంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఉపాధిహామీపధకం ద్వారా రూ.3కోట్లు మేర నిధులు మంజూరైనాయి.అమ్మపాలెంకు రూ.13లక్షలు,అంకభూపాలపురంకు రూ.10లక్షలు,అయ్యవారిపల్లెకు రూ.9లక్షలు,బడేవారిపాలెంకు రూ.58లక్షలు,చుండికి రూ.13లక్షలు,కాకుటూరుకి రూ.15లక్షలు,కలవళ్లకి రూ.27లక్షలు,కొండసముద్రంకు రూ.14లక్షలు, లింగపాలెంకు రూ.13లక్షలు,నలదలపూరుకు రూ.13లక్షలు, నేకునాంపురంకు రూ15లక్షలు, పోకూరు రూ.25లక్షలు,పోలినేనిచెరువు రూ.7లక్షలు,పోలినేనిపాలెంకు రూ.17లక్షలు,శాఖవరంకు రూ.31లక్షలు,శామీరపాలెంకు రూ.13లక్షలు,శింగమనేనిపల్లెకు రూ.7లక్షలు చొప్పున కేటాయించారు. మిగిలిన గ్రామాలకు రెండోవిడత మంజూరుచేయనున్నట్లు సమాచారం.

## వాహనదారులకు క్లాసు పీకిన సిఐ,ఎస్ఐ




**సంగం అక్టోబర్ 18 ప్రభాతవార్త :** సంగం బస్‌స్టాండ్ సెంటర్‌లో జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాలనివారణపై వాహనదారులకు సిఐ వేమారెడ్డి,ఎస్ఐ రాజేష్ అవగాహన కల్పించారు.వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు .మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి వాహనాలు సీజ్ చేస్తాం అని తెలిపారు. ఆటోలో పరిమితికి మించి ప్రమాణికులను ఎక్కించరాదని వారు సూచించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహనదారులు సహకరించాలని వారు కోరారు.

## పల్లె పండుగతో గ్రామాభివృద్ధి : సర్పంచ్ గోవిందమ్మ




**ఉలవపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** ఉలవాపడు మండలం ఆత్మకూరు గ్రామాల్లో శుక్రవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీఓ ఎన్.విజయ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా ముఖ్య అతిదిగా ఎంపీడీఓ ఎన్.విజయ హాజరై పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. రూ.20లక్షల రూపాయలతో మంజూరైన అభివృద్ధి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు తాగునీరు, పారిశుధ్య, వీధి లైట్లు ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని వెల్లడించారు. ఆత్మకూరు సర్పంచ్ నాళం గోవిందమ్మ మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావుతో ఇక గ్రామాల్లో ప్రగతి పుంజుకుంటుందని, అందుకు ప్రజల సహకారం ఎంతో అవసరం అన్నారు. పల్లె పండుగతో గ్రామాల్లో సీసీ రోడ్లు వేయటం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ వెంకట సుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశాన్నంటుతున్న నిత్యవసర సరుకులు, కూరగాయల ధరలు



**ఉలవపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** అయ్యా.. ప్రభుత్వ పెద్దలారా నిత్యవసర సరుకులు, కూరగాయాల రేట్లు రోజురోజుకు రేట్లు పెరిగి అకాశానికి అంటుతున్నాయని ఉమ్మడి ప్రకాశం జిల్లా యాదవ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు సామాన్య ప్రజలకు నిత్యవసర సరుకులు, కూరగాయల రేట్లు పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వానికి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఎంతసేపటికి మద్యానికి రేట్లు తగ్గించామని చెబుతున్నారు తప్ప నిత్యం ప్రజలు ఉపయోగించుకుని నిత్యవసర సరుకులు, కూరగాయల రేట్లు పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వానికి శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఎంతసేపటికి మద్యానికి రేట్లు తగ్గించామని చెబుతున్నారు తప్ప నిత్యం ప్రజలు ఉపయోగించుకుని నిత్యవసర సరుకులు రేట్లు పెరుగుదలపై దృష్టి పెట్టకపోవడం దారుణమని అన్నారు. కిలో వంద రూపాయలు ఉన్న నూనె ఈ రోజు రూ.125కి పెరిగిందని, అలాగే ప్రతి ఒక్క వస్తువుపై రేట్లు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఏమి కొనేటట్టు లేదని, ఏమి తినేటట్టు లేదన్నట్లుగా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే నిత్యవసర సరుకుల రేట్లు పెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని శ్రీనివాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మొగలిచెర్లలో మెడికల్ క్యాంపు



**లింగసముద్రం, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** లింగసముద్రం ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ క్యాంపుకు 136 మంది వివిధ రకాలైన వ్యాధులతో బాధపడువారు హాజరయ్యారు. వీరిలో ఐదుగురు రెండు మూడు రోజుల క్రితం జ్వరంతో బాధపడి ప్రస్తుతం మోకాళ్ళ, ఒంటి నొప్పులతో వచ్చారు. ప్రస్తుతం వారికి జ్వరపరీక్ష నిర్వహించగా ఎటువంటి జ్వరం నిర్ధారణ కాలేదు. థైరాయిడ్ వ్యాధితో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇవ్వడం జరిగింది. అదేవ ఇధంగా తదుపరి రోజుల్లో ఎవరికైనా జ్వరం గాని, తలనొప్పి గాని, ఒళ్ళు నొప్పులు గాని ఉంటే వెంటనే ప్రాధమిక ఆరోగ్య కేంద్రం లింగసముద్రంకు వచ్చి ఉచిత రక్త ఫరీక్షలు చేసుకుని తగిన మందులు తీసుకోవాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీనివాసులు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ శ్రీహరి, ఖాదర్ వలి,మృదుల, స్వాతి, మోబినా భాను, పార్వతి, సుశీలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిబిఐ పేరుతో నగదు ఇవ్వాలని బెదిరింపు కాల్స్

**బిట్రగుంట, అక్టోబరు 18 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలులో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులకు సిబిఐ పేరుతో నగదు ఇవ్వాలని బెదిరింపు కాల్స్ వచ్చినట్లు విలేకర్లకు తెలిపారు. తన కుమారుడు ముగ్గురు ఆడపిల్లలను వేధిస్తున్నాడని తమ కస్టడీలో వున్నాడని వెంటనే ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా 40 వేల రూపాయలు జమ చేయాలని బెదిరించారన్నారు. దీంతో కంగారు పడిన అతను తనకు హిందీ రాదని ఆంగ్లంలో మాట్లాడాలని కోరగా నిరాకరించారు. ఆలస్యమైతే కేసు నమోదు చేస్తామని మీ అబ్బాయి జీవితం నాశనమైపోతుందని హెచ్చరించినట్లు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన శ్రీనివాసులు హిందీ వచ్చిన ఓ యువకుడి వద్దకు వెళ్లి మాట్లాడించగా మరింత కటువుగా వ్యవహరించాడు. నా కుమారుడు ఏ తప్పు చేయలేదని నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో డబ్బులు ఇచ్చే ప్రసక్తే లేదని తాను ఫోన్ కట్ చేసినట్లు చెప్పాడు. ఆ తర్వాత తన కుమారుడికి ఫోన్ చేసి క్షేమ సమాచారాలు తెలుసుకుని అది ఫేక్ కాల్‌గా గుర్తించానన్నారు. ఇదే తరహాలో బోగోలులో కూడా మరో వ్యాపారస్తుడికి ఫోన్ చేసి రెండు లక్షలు నగదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ వార్తలు బోగోలు అంతా తెలియడంతో పలువురు కంగారు పడి బిట్రగుంట పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు ఇటువంటి బెదిరింపు కాల్స్ పట్ల అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు.

## నిబంధనలు పాటించాలి...



**వరికుంటపాడు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** వ్యాపారస్తులు తప్పక ప్రతి వస్తువు అమ్మే సమయంలో నిబంధనలు పాటించాలని ఫుడ్ సేఫ్టీ అధికారిణి నీరజ సూచించారు. శుక్రవారం వరికుంట పాడు మండల కేంద్రంలో ఉన్న పలు దుఖానాలను ఆమె తనిఖీ చేసి సరైన లైసెన్స్‌లు లేనివారికి నోటీసులు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం వారు అందజేసిన ఫిర్యాదు మేరకు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి తనిఖీలు చేపట్టారు. ఒక వస్తువును కొన్న అమ్మిన తప్పక తయారు చేసిన తేది ,గడువు తేది లు ప్యాకెట్ లపై ఉంటేనా అమ్మకాలు చేయాలని అలా కాకుండా నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేస్తున్నారనే సమాచారంతో పలు దుఖాణాలు మూసివేయడం కొసమెరుపు.

## వసతి గృహాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కోవూరులోని సాంఘిక సంక్షేమ బాల బాలికల వసతి గృహాలను ఆదర్శంగా తీర్చిదిద్దేలా సంబంధిత వసతి గృహాల సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏఎం డబ్ల్యూ తిరుపతయ్య అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ బాలబాలికల వసతి గృహాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిదంగా ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వసతి గృహంలోని విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పట్ల చొరవ తీసుకుని వారికి అవసరమైతే మంచినీటిని కాచి ఇవ్వాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఉన్న వసతి గృహాల సంక్షేమాధికారులు ఈ విద్యా సంవత్సరంలో నూరుశాతం ఫలితాలు సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. సీ, డీ గ్రేడ్ ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా ఆయనపేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సంక్షేమాధికారులు వెంకట్రావు, పద్మావతి, సుప్రజ, తదితరులు ఉన్నారు.

## స్త్రీనిధి వసూళ్లు 95 శాతం



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కోవూరు సంఘమిత్ర పరిధిలోని ఆరు మండలాలకు సంబంధించి స్త్రీనిధి వసూళ్లు 95 శాతం ఉన్నాయని స్త్రీనిధి మేనేజర్ మేరీ తెలిపారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం ఆమె ఏపీఎం సుబ్బంజుతో పలు విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం స్త్రీనిధి ద్వారా పొదుపు గ్రూపు సభ్యులకు 10 లక్షల మేర యూనిట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, దీనికి సంబంధించి సభ్యుల ఎంపిక పరిశీలన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ 10 లక్షలతో ఎంబ్రాయిడరీ, హైరర్స్, సెంట్రింగ్, సూపర్ మార్కెట్ తదితర వాటిని గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం స్త్రీనిధి ద్వారా గ్రూపుకు రూ. 5 లక్షల మేర రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు వడ్డీ 11 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్త్రీనిధి ద్వారా కోవూరు మండలానికి 7 కోట్లు రుణాలు అందించాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని, ఇప్పటివరకు 2.5 కోట్లు రుణాలు అందించడం జరిగిందన్నారు. 2025 మార్చి లోగా మిగిలిన రుణాలు కూడా గ్రూపులకు అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘమిత్ర కార్యదర్శి ధనమ్మ, సీసీలు రాజశేఖర్, చైతన్య, రాము, అకౌంటెంట్ సుధా, తదితరులు ఉన్నారు.

## బిట్రగుంట-తిరుపతి మెమో రైళ్లను పునరుద్దరించండి




**బిట్రగుంట, అక్టోబరు 18 ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్‌లో గతంలో కరోనా ముందు నడిచే బిట్రగుంట-తిరుపతి, తిరుపతి -బిట్రగుంట మెమో రైళ్లను పునరుద్దరించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్.కె.నూరుద్దీన్ విజ్ఞప్తి చేశారు. బోగోలు మండలం విశ్వనాధరావుపేట పంచాయతీలోని ఇబ్రహీంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కరోనా ముందు నడిచే గుంటూరు-తిరుపతి రైలును రైల్వే అధికారులు నంద్యాల-కడప మీదుగా నడుపుతున్నారన్నారు. ఈ కారణంగా పేద, మధ్యతరగతి ప్రయాణికులు గూడూరు, వెంకటగిరి, కాళహస్తి, తిరుపతి ప్రాంతాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయమై రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. అలాగే బిట్రగుంటలో ఇంటర్ సిటీ, జనశతాబ్ది వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ కల్పించాలన్నారు. సికింద్రాబాద్-గూడూరు మధ్య నడిచే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళలు శుక్రవారం నుండి ప్రయాణికులు అనుకూలంగా నడిచేలా కృషి చేసిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు దాసరి సునీల్, బత్తుల రవిచంద్ర, ఫ్రాన్సిస్, ఆరోగ్యరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** విద్యార్థి జీవితంలో పదవ తరగతి అనేది కీలకమని, ఈ దశలోనే వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి మంచి ఫలితాల సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలని ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమావేశ మందిరంలో శుక్ర వారం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచే విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను మరింత వెలికి తీసేలా ఉపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పాఠశాలకు జిల్లా స్థాయిలో మరింత పేరు వచ్చేలా ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## ట్రాఫిక్కు అంతరాయం కలిగిస్తున్న పశువులు



**ఉదయగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** ఉదయగిరి మండలం లోని బస్టాండ్ సెంటర్లో సాయంకాలం నుండి మరుసటి రోజు ఉదయం వరకు ఎక్కెడెక్కడో ఆహారాన్ని సేకరించి పదుల సంఖ్యలో ఆవులు బస్టాండ్ సెంటర్లో తిష్ట వేసి ఉండిపోతున్నాయి. ఈ ఆవులు బస్టాండ్ సెంటర్లో ఎక్కడంటే అక్కడ పడుకోవడం వలన రాత్రి సమయంలో ఉదయగిరి బస్టాండ్ లో తీవ్రమైన ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుండటంతో పలువురు ప్రజలు ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన పంచాయతీ శాఖ అధికారులు కానీ ఇతర అధికారులు కానీ సమస్య పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారుల ఆక్రమణలతో అనధికార వ్యాపార సముదాయాలతో అంతంత మాత్రంగా ఉండే ఉదయగిరి వెడల్పు లేని రోడ్లలో ఎక్కడంటే అక్కడ ఆవులు పడుకోవడం వలన వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న పట్టించుకునే నాధులు లేరని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి బస్టాండ్ లో చేరుతున్న ఆవులు ఎవరికి చెందినవో విచారణ జరిపి ఆ యజమానులను వాటిని అప్పగించాలని మరొకసారి ఆవులు రోడ్లమీదకి రాకుండా కఠినమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజా పాలకులు ఈ సమస్యను గుర్తించి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## నవోదయ విద్యాలయంలో దరఖాస్తు లు స్వీకరణ

**మర్రిపాడు, అక్టోబర్18 ప్రభాతవార్త:** మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 9,11తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ శ్రీనివాసరావ్ తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 9,11 తరగతుల ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అక్టోబరు 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## మొక్కల పెంపకంపై విద్యార్థులు దృష్టి సారించాలి



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రధానో పాధ్యాయు రాలు కె. భారతి తెలిపారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలు జీవకోటికి ప్రాణవాయువును ఇస్తాయని, ప్రతి విద్యార్థి తమ ఇంటి దగ్గర కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు సూచించారు. లైబ్రేరియన్ జె. సురేంద్రరెడ్డి మాట్లాడుతూ తమ గ్రంథాలయ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## నేత్రదానం చేసిన సుధాకర్‌రెడ్డి





**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కోవూరుకు చెందిన బండి సుధాకర్‌రెడ్డి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను చేపటే వారు. పేదలకు అంత్యక్రియలకు తన వంతుగా సహాయ సహకారాలు అందించిన మానవతావాది. ఇటీవల కోవూరులోని కైలాసభూమిలో రూ. 10 లక్షలపైగా వ్యయం చేసి పార్థివదేహ నిలయాన్ని ఏర్పాటు చేశారు. అటువంటి వ్యక్తి శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ మేరకు కుటుంబ సభ్యుల అనుమతితో సుభాష్ సేవా సంఘం అధ్యక్షులు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని మృతుడు సుధాకర్‌రెడ్డి రెండు నేత్రాలను నెల్లూరు అంధత్వ నివారణ సంస్థకు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ మేరకు సుధాకర్‌రెడ్డి కుమారుడు సృజన్‌రెడ్డికి అంధత్వ నివారణ సంస్థ ద్వారా దృవీకరణ పత్రం కూడా అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సందర్శించి నివాళులర్పించారు.

## నేడే ఉదయగిరిలో పల్లె పండుగ కార్యక్రమం



**ఉదయగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరిలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమానికి ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పాల్గొనడం జరుగుతుందని ఉదయగిరి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి మండలంలోని నేలటూరు జీ చెర్లోపల్లి శకునాలపల్లి గ్రామాలలో ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న శాసనసభ్యులు కాకర్ల సురేష్ వారిచే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అదేవిధంగా గ్రామాలలో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వంలో పల్లెలకు మహర్దశ పట్టిందని ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమానికి మండలం లోని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానులు భారీగా తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సందర్భంగా కోరారు.

## వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన పోలీసులు



**ఉదయగిరి, అక్టోబర్ 18, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరిలోని మూడు కూడలి లో గల వైయస్సార్ విగ్రహం వద్ద ఉదయగిరి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం నిరంతరం జరుగుతుందని తెలిపారు. హెల్మెట్ ధరించడం వలన ద్విచక్ర వాహనదారులు ఎంతో విలువైన ప్రాణాలను ప్రమాదాల నుండి రక్షించుకోవడం జరుగుతందని తమను నమ్ముకున్న కుటుంబీకులు ఇబ్బంది పడకుండా ఉంటారని అన్నారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు నడపటానికి అనుమతి లేదని కొత్త చట్టాలు అమలులోకి వచ్చినందున చట్టానికి లోబడి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని తెలిపారు. సరైన పత్రాలు లేకుండా లైసెన్సు లేకుండా వాహనాలు నడిపే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అలాగే స్కూలల్లో మైనర్లకు వహనాలు నడపటానికి అనుమతి ఇచ్చిన తల్లిదండ్రులు మీద కేసులు నమోదు చేస్తామని తెలిపారు. మోటారు వాహన చట్ట పరిధిలో ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్లు ధరించాలని సీట్ బెల్ట్ ధరించి ఫోర్ వీలర్ ను నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఇంద్రసేనారెడ్డి తో పాటు ఏఎస్సై కానిస్టేబులు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మానవతా వాది, సంస్కరణాభిలాషి జస్టిస్ లక్ష్మణరావుకు నివాళులు



**కావలి, అక్టోబరు 18 ప్రభాతవార్త :** రెడ్‌క్రాస్ పూర్వ ఉమ్మడి రాష్ట్ర అధ్యక్షులుగా సుదీర్ఘకాలంగా పనిచేసిన దివంగత జస్టిస్ అంబటి లక్ష్మణరావుకు శుక్రవారం కావలి రెడ్‌క్రాస్ రక్త కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాకారపు రవిప్రకాష్ మాట్లాడుతూ అంబటి లక్ష్మణరావు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారన్నారు. పదవీ విరమణ అనంతరం రెడ్‌క్రాస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి పలు నూతన సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కావలి రెడ్‌క్రాస్‌కు సహకారం అందించారన్నారు. ఎన్నికల నిఘా వేదిక స్థాపించి పారదర్శక ఎన్నికల నిర్వహణకు కృషి చేశారన్నారు. జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాల నిషేధం కోసం పోరాడారన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సభ్యుడు, కావలి రెడ్‌క్రాస్ కోశాధికారి కలికి శ్రీహరిరెడ్డి, హరినారపరెడ్డి, బి.ఎస్.ప్రసాద్, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్న సంఘంలోని గిరిజనులకి కూరగాయలు పంపిణీ



**ముత్తుకూరు, అక్టోబర్ 19, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండలం పైనాపురం పంచాయితీలో నివాసముంటున్న చిన్న సంఘం గిరిజనులకి కూరగాయలను జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా నెల్లూరు జిల్లాలో మూడు రోజులు పాటు కురిసిన వర్షాలతో సర్వేపల్లి నియోజకవర్గంలో గుడిసెల్లో నివాసం ఉంటున్న గిరిజనులు ఎన్డీఏ కూటమి సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నుంచి మా వంతు కూరగాయలు, పిల్లలకి బిస్కెట్స్ పంపిణీ చేసామన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఉన్నటువంటి గిరిజనులని వైసిపి పార్టీ ఏ విధంగా కూడా ఆదుకోలేదన్నారు. తుఫాన్లు వర్షాల సమయంలో కనీసం 10 పైసలు కూడా ఆర్థిక సాయం అందించలా కానీ మీడియా సమావేశాలు పెట్టుకుంటూ వ్యక్తిగత విమర్శలు చేస్తూ కోట్ల రూపాయలు దోచుకుని, బుల్లి కార్యకర్త నుంచి ఎమ్మెల్యేలు, ఎంపిలు, ముఖ్యమంత్రి దాకా ఈ రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఈ సర్వేపల్లి నియోజకవర్గంలో కనీసం పేదవాడి సొంత ఇంటి కల కూడా నెరవేర్చలేదన్నారు. ఇప్పటికి ఆధార్, రేషన్ కార్డు లేని గిరిజనులు ఉన్నారన్నారు. ప్రతి 50 కుటుంబాలకి ఒక్క వాలంటీర్ని పెట్టారు. మరి ఆ వాలంటీర్లు ఐదు సంవత్సరాలు పాటు ఏం చేశారో ఆ వైసిపి నాయకులకే తెలియాలన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకొని మీరు దోచుకున్న దాంట్లో ఒక పావలా అయినా సరే సహాయం చేయడం నేర్చుకోండని వైసిపి నాయకులకి సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు గమ్మినేని వాణి, భవాని నాయుడు, వెంకటాచల మండల కార్యదర్శి నందురి శ్రీహరి, ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, చిన్న, స్థానిక పైనపురం నాయకులు కావలి మస్తాన్, మండల మహిళా అధ్యక్షురాలు కావలి కవిత తదితరులు పాల్గొన్నారు.

## గంగవరంలో ట్రాఫిక్ జామ్

**– ఆందోళన చేసిన గ్రామస్తులు**

**కోవూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని ముంబయి రహదారి రోడ్డు ,కళాశాలకు వచ్చే బస్సులు , మోటార్ సైకిళ్ల ద్వారా ప్రతి రోజూ ఉదయం వేళల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ కళాశాలకు విద్యార్థులు ఉదయం వెళ్లే క్రమంలో సింగల్ రోడ్డు కావడంతో ఒకేసారి కళాశాలకు చెందిన బస్సులు పదుల సంఖ్యలో రావడం అదే సమయంలో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు రావడంతో ఈ రహదారి గంగవరం గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుంది. గతంలో ఎంతో మంది ఈ గ్రామానికి చెందిన వారు అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరుకు వెళ్లే సమయంలో ఈ రహదారి కారణంగా ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా కళాశాల యాజమాన్యం జోక్యం చేసుకుని ఈ ప్రాంతంలో రోడ్డును వెడల్పు చేసేలా దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ రోడ్డు వసతి కూడా లేదని, రైతులందరం కలిసి తమ పట్టా పొలంలో కొంతభాగం ఇచ్చి అప్పటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేత రహదారి, వంతెన వేయించుకున్నామని జొన్నవాడ మాజీ ట్రస్టీ లక్ష్మీనరసారెడ్డి తెలిపారు. కాలక్రమంలో ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కావడంతో రాకపోకలు పెరిగాయని, ఈ కారణంగా గంగవరం గ్రామంలోని ప్రజలు ప్రతి రోజూ ట్రాఫిక్ జామ్ వలన ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కళాశాల యాజమాన్యం వారి రాకపోకలకు రోడ్డు వెడల్పు చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## ఉద్రిక్తతలకు దారితీసిన బొడ్రాళ్ళ ప్రతిష్ట
## పోలీసుల రంగప్రవేశంతో సుఖాంతం



**జలదంకి, అక్టోబర్18, ప్రభాతవార్త:** పోలీసుల సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని అతిక్రమించి ప్రధానగ్రామ వాసులు బొడ్రాయి ప్రతిష్టించే ప్రయత్నం గ్రామంలో ఉద్రిక్తతలకు దారితీసింది. .పోలీసుల సూచనలను కూడా లెక్కచేయకుండ పైఅదికారులు వచ్చేవరకు ఆగండన్న రిక్వెస్టునుసైతం పెడచెవినపెట్టే ప్రయత్నం చేశారు. ఈవివాదస్పద చర్య జలదంకి మండలం గట్టుపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గతంలోనే వివాదాస్పదమైన ప్రతిష్టను గ్రామ దళితులు పోలీసు అదికారుల దృష్టికి తీసుకుపోవడం వారు రాజీ ప్రయత్నం చేయడం జరిగింది. అయితే ఎంతకీ సమస్య కొలిక్కిరాకపోవడంతో పోలీసు అధికారుల సలహా మేరకు ఎస్‌సిలు బొడ్రాళ్ళు ప్రతిష్టించారు. దీంతో గ్రామంలో మంచి వాతావరణం ఏర్పడింది కాగా ప్రధానగ్రామస్తులు కూడా బొడ్రాళ్ళు ప్రతిష్టించాలని నిర్ణయించి ఈమేరకు కార్యచరణ రూపొందించారు. విషయం తెలిసి పోలీసులు దయంనుంచే గ్రామంలో తిష్టవేసి నిర్వాహులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కాని కొంద మంది యువత పోలీసులను సూచనలను లెక్కచేయకుండ రాయిని ప్రతిష్టిం చారు. ఇది గ్రామంలో వివాదానికి దారితీసింది దీంతో దళితులు, ప్రధాన గ్రామస్తులు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఏం జరుగుతుందోనన్న ఆందోళన అందరిలో నెలకొంది. ఈక్రమంలో కలిగిరి సిఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్ఐ లతీఫున్నీష గ్రామానికి చేరుకున్నారు. నిర్వాహకుల చర్యల్ని ఖండించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సున్నితమైన సమస్యని సామరస్యంగా పరిష్కరించుకోవాలికాని ఇలా చేయడం కరక్టుకాదని హెచ్చరించారు. గతంలో వ్రాసుకున్న ఒప్పంద పత్రాల్ని పరిశీలించారు. సిద్దాంతితోకూడ మాట్లాడారు శాస్త్రం ఏంచెబుతుందని ఆరాతీశారు. ఎట్టకేలకు పరిస్థితిని చక్కదిద్ది అందరికి ఆమోదయోగ్యమైన చర్యలు చేపట్టారు. దీంతో సమస్య సుఖాంతమైంది.

## వాహనదారులు తప్పనిసరి హెల్మేంట్ దరించాలి




**వెంకటాచలం అర్టోబర్ 18 ప్రభాతవార్త :** వాహనదారులు ప్రమాదాలనుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరు హెల్మేంట్ దరించాలని వెంకటాచలం ఎస్ఐ అంజనేయలు వాహనదారులకు సూచించారు. శుక్రవారం మండల పరిదిలోని వెంకటాచలం సర్వేపల్లి క్రాస్ రోడ్డు వద్ద టూ వీలర్ వాహనదారులకు హెల్మేంట్ గురించి అవగాహన కల్గించారు. వాహనదారులు ప్రయాణ చేసే సమయంలో ట్రాపిక్ నియమాలు పాలించాలన్నారు. అతివేగంగా వాహనాలు నడపటడం వలన ప్రమాదాలగు గురైవుతున్నారు. హెల్మేంచి దరించడం వలన ప్రమాదం నుంచి ప్రాణాలు కాపాడుకోవచ్చునన్నారు. ప్రతి వాహనదారుడడు హెల్మేంట్ దరించాలన్నారు.

## ఎస్‌వీ యూనివర్సిటీ టాప్ ర్యాంకర్‌గా డాక్టరేట్
## పొందిన గ్రామీణ విద్యార్థిని మానస



**గుడ్లూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** గుడ్లూరు మండలం చెమిడిదిపాడు అంబేద్కర్‌నగర్‌కు చెందిన గంగోలు మానస ఎస్‌వీ యూనివర్సిటీ టాప్ ర్యాంకర్‌గా డాక్టర్‌రేట్(పీహెచ్‌డీ) సీటు పొందింది. గంగోలు మాల్యాద్రికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారి ఒక కుమార్తె మానస. మానస మధ్య తరగతి కుటుంబంలో జన్మించి ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఉన్నతమైన చదువులో ప్రవేశం పొందింది. ఒకటో తరగతి నుండి 7వ తరగతి వరకు చెమిడిదిపాడులో, 8వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉలవపాడు, 10వ తరగతి కందుకూరులో, ఇంటర్మీడియట్ పెద్దపవని గురుకులలో, డిగ్రీ పద్మావతి యూనివర్సిటీ తిరుపతిలో, పీజీ పద్మావతి యూనివర్సిటీ తిరుపతిలో, బీఈడీ, పీహెచ్‌డీ ఎస్‌వీ యూనివర్సిటీలో విద్యభ్యాసం జరిగింది. విద్యార్థిని తండ్రి గంగోలు మాల్యాద్రి ఆర్‌ఎంపీ వృత్తి చేస్తున్నాడు. ప్రస్తుత సమాజంలో ఆడ పిల్లలు ఎందులో తక్కువ కాదు అన్ని రంగాల్లో ఆడ పిల్లలు అగ్రగామిగా ఉంటారని నా కుమార్తె మానస నిరూపించిందని తండ్రి మాల్యాద్రి సంతోషాన్ని వ్యక్తం చేశాడు. అదే విధంగా మన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించుకుందాం మంచి విద్యార్థి విద్యార్థినులుగా పెంచుకుందాం అని, ఏ స్థాయిలోనైనా ప్రభుత్వ పాఠశాలల నుండే మంచి ర్యాంకర్‌లు వస్తారు ఇది ప్రజలు గమణించి ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని, ఈ దేశానికి మంచి పౌరులను అందిద్దామని చెప్పారు.

## విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి




**కందుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త :** చదవడం, రాయడంలో ఇబ్బంది పడుతూ డిస్లెక్సియా రుగ్మతతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి వారిలో ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించాలని స్థానిక బాలుర హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం బాలుర హైస్కూల్, భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో డైస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాందోళనలను తొలగించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఐఈఆర్టీ కూనం ఉదయలక్ష్మీ మాట్లాడుతూ డస్లెక్సియాతో బాధపడుతున్న చిన్నారులలోని అభ్యసన లోపాలను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరిచి ఆ లోపాలను అదిగమించేలా రెమిడియల్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచడం ద్వారా వారిలోని లోపాలను గుర్తించి అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు తలపనేని శ్రీనివాసరావు, ఐఈడీఎస్ఎస్ ఏసుదాసు, రమణయ్య, శ్రీనిధి, పెరుగు ప్రసాద్, సీఆర్‌ఎంటీ ఎంవీ రమణారెడ్డి, కోటకట్టవీధి పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, కల్పన, సిరాజుద్దిన్ తదితర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పించిన సిఐ రాజేశ్వరరావు



**కావలి రూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వర రావు కావలి రూరల్ మండలం రుద్రకోట సమీపాన వున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు డ్రైవింగ్ లైసెన్సు పై అవగాహన కల్పించి హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్సు ను పొంది ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని లేనిపక్షంలో జరిమానాలు విధించడం జరుగుతుందని సిఐ రాజేశ్వరరావు తెలిపారు. కళాశాలప్రిన్సిపాల్ఎ. నుశీల్‌కుమార్‌ప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చాగణంరాజుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**సైదాపురం, అక్టోబర్ 18, ప్రభాతవార్త** మండల పరిధిలోని చాగణం రాజుపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారిణి హైమావతి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖకు సంబంధించిన ఉద్యానశాఖ అనుబంధ శాఖలు శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఉన్న నిమ్మ తోటలను వారు పరిశీలించారు. అనంతరం మండల ఉద్యానశాఖ అధికారి ఐ.ఆనంద్, హార్టికల్చర్ ద్వారా అమలవుతున్న పథకాలు, వాటి రాయితీల గురించి రైతులకు వివరించారు. నిమ్మచెట్లలో వచ్చే చీడపీడల గురించి వాటి నివారణపై రైతులకు వివరించారు. నాయకులు నందిమండలం రవీంద్రరాజు, రాజేంద్రప్రసాద్‌రాజు, సుధాకర్‌రాజు, ముప్పాల రాజేష్, తులసి, వెంకటేశ్వర్లురాజు, వ్యవసాయ సహాయకులు సాయిప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్‌కి అంతరాయం

**నెల్లూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** నగర పరిధిలో చెట్ల తొలగింపులు, విద్యుత్ లైన్ల మరమ్మత్తులు కోసం శనివారం 33/11 కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో అయ్యప్ప గారి తోట, దీనదయల్ నగర్, పల్లిపాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు 33/11 కేవీ వెంకటేశ్వరపురం, సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ గాంధీ గిరిజన కాలనీ ఫీడర్ పరిధిలో గాంధీ గిరిజన కాలనీ, వారాది సెంటర్, సాలుచింతల పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు 33/11 కేవీ యనమల వారి దిన్నె సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవి బలిజపాలెం ఫీడర్‌లో ఆకుతోట, బలిజపాలెం, మిట్టపాలెం, మల్లెలమ్మ తోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు 33/11 కేవి ఎంజీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో బ్రహ్మానందపుం, రాజగోపాలపురం, ఆదర్శనగర్, సుజాతమ్మ కాలనీ, జేవీఆర్ కాలనీ, లక్ష్మీనర సింహపురం, బెజవాడ ఓబుల్‌రెడ్డి నగర్, కేవీఆర్ పెట్రోల్ బంకు ఏరియా, ఎస్పీ ఆఫీస్, నీలగిరి సంఘం, బట్వాడిపాలెం, బారా షాహిద్ దర్గా పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్‌ని నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని నెల్లూరుటౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్‌ఇంజనీర్ ఎం.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మద్యం దుకాణం వద్దంటూ మగువల వినతి



**నెల్లూరు క్రైం, అక్టోబర్ 18, ప్రభాతవార్త** తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొదంటూ స్థానిక వెంకటేశ్వర పురం విజయాడైరీ ప్రాంత స్థానికులు ఆందోళనకు దిగారు. ఈ మేరకు శుక్రవారం ప్రొహిబిషన్ అండ్, ఎక్సైజ్ డిసి శ్రీనివాస రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ విజయాడైరీ ప్రాంతంలో తాము ఎన్నో ఏళ్లుగా జీవిస్తున్నామన్నారు. ఎంతో మంది మహిళలు డైరీలో పనిచేస్తున్నారని స్థానిక మహిళలు సైతం ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో పాలకోసం డైరీకి వెళుతారన్నారు. డైరీకి సమీపంలోనే స్కూల్, మసీదు ఉన్నాయన్నారు. డైరీ పక్కన మద్యం దుకాణం ఏర్పాటుకు మద్యం వ్యాపారులు చూస్తున్నారన్నారు. దుకాణం ఏర్పాటైతే ఈ ప్రాంతంలో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే ప్రమాదముందన్నారు. ఎక్సైజ్‌అధికారులు అనుమతులు మంజూరుచేయవద్దని కోరారు.

## గంగవరంలో నేడు రీసర్వే గ్రామ సభ



**కోవూరు అక్టోబర్ 18 ప్రభాతవార్త** కోవూరు మండలం గంగవరం పంచాయితీ కార్యాలయంలో శని వారం భూములకు సంబందించి రీసర్వే గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసిల్దారు నిర్మలానందబాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతు గంగవరం పంచాయితీ కి సంబందించి రైతులు ఎవ్వరైనా భూములకు సంబందించి రీసర్వే విషయంలో ఎమైనా సమస్యలు ఉంటే వచ్చి ఈగ్రామ సభకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈగ్రామ సభకు తహసిల్దారుతోపాటు సర్వేయర్ గ్రామ రెవిన్యూ అధికారులు హాజరౌతారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ అవకాశాన్ని గంగవరం గ్రామ పంచాయితీకి సంబందించిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## సకాలంలో ఇంటి పన్ను చెల్లించండి



**కందుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త** కందుకూరు పురపాలక సంఘం పరిధిలో ఇంటి పన్ను నీటి పన్నును సకాలంలో చెల్లించాలని పురపాలక సంఘ కమీషనర్ అనూష కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ హాల్లో శుక్రవారం పట్టణంలోని 16 సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో ఇంటి పన్నులు, నీటి పన్నులు బకాయిలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమీషనర్ అనూష మాట్లాడుతూ 2024-2025 సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు, నీటి పన్నులు బకాయిలు ఉన్న యజమానులు వెంటనే చెల్లించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. పన్నులు చెల్లించని యెడల వారి నీటి కుళాయి కనెక్షన్లు తొలగిస్తామని అంతే కాకుండా 1965 యాక్ట్ ప్రకారం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అడ్మిన్ సెక్రటరీలు పన్ను బకాయిలపై దృష్టి సారించి పన్నులు వసూళ్లు చేయాలని సూచించారు. పన్ను బకాయి దారులు వెంటనే పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పాడాల్సిందిగా కమీషనర్ తెలియజేశారు.

## రాష్ట్ర కబడ్డీ పోటీలకు నరసాపురం విద్యార్థినీ



**ఇందుకూరుపేట, అక్టోబర్ 18, ప్రభాతవార్త** ఇందుకూరుపేట మండలం నరసాపురంలోని ఎంవీఆర్ ఆర్ ఉన్నత పాఠశాల ప్లస్ విద్యార్థినీ కుమారి ముక్కంటి శ్రీతేజ 9వ తరగతి రాష్ట్ర కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 1వ తేదీ నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నెల్లూరు ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 ఇయర్స్ బాలికల కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం నరసాపురం బాలికలు సాధించారు. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన కుమారి ముక్కంటి శ్రీ తేజ ను రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేశారు. ఈ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నవంబర్ నెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు బాపట్లలో జరుగు పోటీల్లో నెల్లూరు జట్టుకు ప్రాతినిధ్యం చేయనుంది. శుక్రవారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో శ్రీతేజను, వ్యాయామఉపాధ్యాయులు ముజీర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగేశ్వరరావు, పాఠశాల చైర్మన్‌శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



**నెల్లూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త-వైద్యం** జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న ఉద్యోగులు పలు సమస్యలను పరిష్కరించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లి పెంచలయ్యకి నగరంలోని సంతపేటలో ఉన్న డీఎంహెచ్ఓ ఛాంబర్లో శుక్రవారం వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అల్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ మృతి చెందిన రమేష్ కుటుంబ సభ్యునికి కంపాస్నెట్ అపాయింట్‌మెంట్ కల్పించాలని, డిస్ట్రిక్ సెలక్షన్ కమిటీ ద్వారా అన్ని అర్హతలు ఉండి హెల్త్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్న జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ మాధవ్‌ని రెగ్యులర్ చేయాలని, సచివాలయం ఏఎన్ఎం గ్రేడ్ 3 పదోన్నతులలో అందరికి న్యాయం జరిగేటట్లు చూడాలని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు ప్రత్యేకించి కంటి వెలుగు కార్యక్రమం, పలు కార్యక్రమాల వల్ల సచివాలయ ఏఎన్ఎంలులకు జాయినింగ్ డేట్‌లో ఎదురైనా ఇబ్బందులు, ర్యాంకింగ్స్ రోస్టర్ అన్నింటిని పరిశీలించి సక్రమంగా జరిగేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశామన్నారు. పెంచలయ్య ఈ సమస్యలన్నింటిపై సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తానని తెలిపాడన్నారు. సచివాలయం ఏఎన్ఎం గ్రేడ్ 3 పదోన్నతుల విషయంలో కూడా అందరూ విజ్ఞప్తులు పరిగణలోకి తీసుకుని ఎవరికి నష్టం కలగకుండా చూడడం జరుగుతుందని అన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్లు నాగ రాజు, మురళి, మహేష్, జిల్లా జాయింట్ సెక్రటరీఉమామహేశ్వర్, వాకాడు తాలూకా ప్రెసిడెంట్ కే.నాగయ్య, వెంకటగిరి తాలూకా మహిళా విభాగం సెక్రటరీ టి.ఉమామహేశ్వరి, ఉద్యోగ సంఘ నాయకులు మాధవ, సర్వే డిపార్టుమెంట్ అసోసియేషన్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, బాల నాగమ్మ, సు మంత్ పాల్గొన్నారు.

## ట్రంకురోడ్డుకు ఇరువైపుల కాలువలపై రేకులు తొలగింపు



**కావలి అక్టోబరు 18 ప్రభాతవార్త** కావలి పట్టణ ట్రంకురోడ్డు ఆధునీకరణలో భాగంగా కావలి మున్సిపల్ అధికారులు ఆక్రమణల తొలగింపులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా శుక్రవారం కావలి పట్టణ ట్రంకురోడ్డుకు ఇరువైపుల కాలువలపై వున్న రేకుల్ని మున్సిపల్ అధికారులు జెసిబితో తొలగించారు. కాలువలపై పాదచారులు నడిచేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నారు. కావలి ట్రంకురోడ్డులో ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాల్ని నివారించాలన్న దృక్పదంతో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ తెలిపారు. కావలి పట్టణ ట్రంకురోడ్డు ఆధునీకరణతో పాటు సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

## మురికి నీటిలో గిరిజన కాలనీ పట్టించుకోని అధికారులు పరిపాలకులు




**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త** మండల వరణి పంచాయితీ వీరారెడ్డి పాలెం గిరిజన కాలనీ వీధుల్లో మురికి నీరు నిల్వ తో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఉట్టూరు రమాదేవి, ఉష, శ్రీనివాసులు విలేకరుల సమావేశం నిర్వహించి వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో ఉన్న మురికి నీరు నిల్వ వలన ప్రతి రోజు గిరిజన కుటుండాల మధ్య గొడవలు జరుగుతున్నాయని ఆరోపించారు. మురుకు నీరు వలన దోమలు, విష పురు గులు ప్రజలను భయ బ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య కొన్ని సంవత్సరాల నుండి ఇలానే ఉంది కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గిరిజనకుటుంబాలై దయవుంచి కాలనీ ఇల్లు, వీధుల సమస్యలను పరిష్క రించాలని ప్రజలు కోరుతున్నారు. గిరిజన కుటుంబాలు పాల్గొన్నారు.

## నేడు సిసి రోడ్లు శంకుస్థాపన



**విడవలూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త** మండలం వావిళ్ళ విడవలూరు గ్రామాల్లో పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాల్లో భాగంగా ఇందిరమ్మ కాలనీ, ఉప్పలపాడు కాలనీలకు 15 లక్షలతో సిసి రోడ్లుకు కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఎంపిడిఓ నగేష్ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు.

## జీవో నెంబర్ 114 క్రమబద్ధీకరించాలి



**చేజర్ల అక్టోబర్ 18 ప్రభాతవార్త** రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులందరిని జీవో నెంబర్ 114 ప్రకారం క్రమబద్ధకరించాలని శుక్రవారం అధ్యాపకులు కోరారు. ఈ సందర్భంగా చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న బప్పంద అద్యాపకులుకళాశాలకు హాజరై పసుపు రిబ్బన్లు ధరించి, జీవో నెంబర్ 114 ప్రకారం తమ సర్వీసులను క్రమబద్ధికరించాలని కూటమి ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు మల్లేశ్వరరావు, సంధాని భాష, శ్రీదర్, సురేష్, యల్లయ్య, ప్రసాద్, సుబ్బారావు, కామాక్షమ్మ, నాగ మల్లేశ్వరమ్మ సాలమ్మ పాల్గొన్నారు.

## ముందరపొట్టెమ్మ తల్లి ఉత్సవాలకు పలువురిని ఆహ్వానించిన కమిటీ సభ్యులు



**కావలి రూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం అన్న గారి పాళెం గ్రామ సమీపాన వేంచేసి వున్న శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి, శ్రీ గంగమ్మ తల్లి కుంభాభిషేక మహోత్సవ ఉత్సవాలు ఈ నెల 26,27,28 తేదీలలో జరుగుతున్నాయని ఈ ఉత్సవాలలో పాల్గొనాలని పలువురిని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాల పెద్దలు కలిసి ఆహ్వానించారు. కావలి డిఎస్పీ శ్రీధర్, కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు, పట్టణంలోని పలువురు ప్రముఖులను శుక్రవారం కలిసి కరపత్రాలు అందజేసి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## 26,27,28 తేదీలలో శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి ఉత్సవాలు





**కావలి రూరల్, అక్టోబరు 18 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం అన్నగారి పాళెం గ్రామ సమీపాన వేంచేసి వున్న అమ్ములుగన్న అమ్ములు శ్రీ ముందర పొటట్టమ్మ, దేవతా సహిత శ్రీ గంగమ్మ తల్లి కుంభాభిషేక మహోత్సవ ఉత్సవాలు ఈ నెల 26,27,28 తేదిలలో మూడు రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్దలతో వైభవోపేతంగా నిర్వహిస్తున్నట్లు అన్నగారిపాళెం, తుమ్మలపెంట గ్రామ పంచాయతీల ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు తెలియజేశారు. అమ్మవారి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఈ నెల 26,27,28 తేదిలలో అమ్మవారి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్దలతో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు భోజన వసతి, మంచినీటి వసతి, ఇతర వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అమ్మవారికి పూల అలంకరణ అన్నగారిపాళెం పంచాయతీ ఒట్టూరు గ్రామస్తులు చేయిస్తున్నారని తెలిపారు. 26వ తేది ఉదయం నాదస్వరం, రాత్రి అన్నగారిపాళెం హరిజనవాడ శ్రీ ముందర పొట్టెమ్మ తల్లి నాట్యమండలి వారిచే శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి చరిత్ర పూర్తి నాటకం ప్రదర్శించబడుతుందని తెలిపారు. 27వ తేది శ్రీ రామాంజనేయ యుద్ధం(వార్ సీను), చింతామణి (భవాని సీను), గయోపాఖ్యానం (వార్ సీను), సత్యహరిశ్చంద్ర (వారణాసి, కాటి కాపరి) ప్రదర్శించబడుతుందని తెలిపారు. 28వ తేది అమ్మవారికి పూల అలంకరణ తుమ్మలపెంట పంచాయతీలోని అన్ని గ్రామాల వారిచే జరుపబడుతుందని తెలిపారు. ఉదయం 10 గంటలకు నెల్లూరు కళాంజలి ఈవెంట్స్ వారిచే గొప్ప సినీ పాటకచ్చేరి, మధ్యాహ్నం 12 గంటలకు తుమ్మలపెంట పంచాయతీలోని అన్ని గ్రామాల దాతలచే భారీ అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 23వ తేది నుండి 30వ తేది వరకు దేవస్థానం వద్ద బలులు నిషేధించడం జరిగిందన్నారు. ఈ ఉత్సవాలలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## హైవేపై ప్రమాదపు స్థలాలను గుర్తించి భద్రతను కల్పించిన రూరల్ సిఐ



**కావలి, అక్టోబరు 18 ప్రభాతవార్త** కావలి 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రమాదపు స్థలాలను గుర్తించి మలుపుల వద్ద తగిన భద్రతను శుక్రవారం కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరరావు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కావలి డిఎస్పీ పి.శ్రీధర్ సూచనలతో 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రమాదపు స్థలాలను గుర్తించడం జరిగిందన్నారు. వాహనదారులకు ప్రాణహాని జరగకుండా ముందస్తు జాగ్రత్తల కోసం వేగ నియంత్రణ అదుపు చేయాలని భద్రత కల్పించామన్నారు. డ్రమ్ములు, టైర్లు మలుపుల వద్ద ఏర్పాటు చేశామన్నారు. ప్రాణం చాలా విలువైనదని తెలిపారు. వాహనదారులు డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రమాదపు స్థలాల దగ్గర వేగ నియంత్రణ పాటించి ప్రాణాలను కాపాడుకోవాలని కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వరరావు తెలిపారు. రూరల్ ఎస్ఐలు సి.హెచ్.తిరుమలరెడ్డి, యం.బాజీబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించిన ఎస్సై సాంబశివయ్య



కందుకూరు, అక్టోబర్ 18, ప్రభాతవార్త కందుకూరు పట్టణం ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో శుక్రవారం సాయంత్రం పట్టణ ఎస్సై సాంబశివయ్య వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు, వాటి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను ముఖ్యంగా యువత రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మరణించడం, అంగవైకల్యానికి గురికావడం జరుగుతుందని, ఈ స్థితికి కారణం అజాగ్రత్త, నిర్లక్ష్య ధోరణి, ముఖ్య కారణమని కావున రోడ్డు ప్రయాణాలు చేసే సందర్భాల్లో హెల్మెట్లు ధరించడం, వాహనాల్లో సీటు బెల్టు పెట్టుకోవడం, ఆటోలలో తక్కువ సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణం చేయడం, అతి వేగాన్ని నిరోధించి మిత వేగంతో ప్రయాణించడం, వాహన దారులందరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సులు పొందడం వాహనాలకు సరైనటువంటి ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లను కలిగి ఉండటం చేయాలని సూచించారు. ఒక వ్యక్తి యొక్క నిర్లక్ష్యం ఆ వ్యక్తి యొక్క ప్రాణానికే ఇతరుల ప్రాణాలకు ముప్పు తీసుకొని వస్తుందని గ్రహించి అందరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి వారి ప్రాణాలతో, ఎదుటి వ్యక్తుల ప్రాణాలను కాపాడుకోవాలని అన్నారు. నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన, మద్యం సేవించి వాహనాలు నడిపిన యెడల పోలీసు వ్యవస్థ, న్యాయ స్థానాల ద్వారా జరిమానాలకు, జైలు శిక్షకుబాధ్యులు కాగలరని హెచ్చరించారు.

## పోలీసుల ఆదుపులో ఇద్దరు కిలాడీ లేడిలు



**రాపూరు, అక్టోబరు18ప్రభాతవార్త** దుకాణాలలో వస్తువులు కాజేస్తున్న ఇద్దరు మహిళా దొంగలను శుక్రవారం రాపూరులోని దుకాణదారులు పట్టుకోని పోలీసులకు అప్పచేప్పారు. పట్టణం లోని మూడు దుకాణాలలో దుకాణాల యజమా నులు వ్యాపారాలలో వుండగా దుకాణాల ముందు వుంచిన నునే డబ్బాలను ఇద్దరు మహిళలు ఎత్తుకోని వెల్లిపోయారు. దీంతో నూనే డబ్బాలు మాయ మవడం చూసిన యజమానులు వెంటనే ఆర్టీసి బస్టాండ్‌కు వెల్లి పరిశీలించగా వెంకటగిరి బస్సులో నూనే డబ్బాలను సీటు కింద వుంచుక్కు ఇద్దరు మహి ళలను గుర్తించారు. వీరిని పట్టుకోని రాపూరు పోలీసులకు అప్పగించారు. వీరు తమది తిరుపతి అని పోదలకూరుకు వెలుతూ తెలియక రాపూరులో దిగినట్లు చేపుతున్నారు. వీరు ఇంకెక్కడైనా దొంగతనాలు చేశారా అన్న కోణంలో పోలీ సులు విచారణ నిర్వహిస్తున్నారు.

## బాధ్యతగా విధులు నిర్వహించాలి



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలను బాధ్యతగా నిర్వహించేలా దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ వారికి కేటాయించిన ఏ పనినైనా సక్రమంగా, పారదర్శకంగా చేపట్టేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రస్తుతం మండలంలో ఉపాధి హామీ పథకం కింద పలు అభివృద్ధి పనులు జరగనున్నాయని, వాటి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## ఎంపీడీవోను అభినందించిన సింగారెడ్డి



**కోవూరు, అక్టోబర్ 18 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్ కార్యాలయ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీహరిరెడ్డిని శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జొన్నవాడ దేవస్థానం ట్రస్టీ సింగా లక్ష్మీనరసారెడ్డి కలిసి శాలువా, పుష్పగుచ్ఛంతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ నాయకులు నాగేంద్ర, ఉన్నారు.

## తిరుపతి ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో ఎమ్మెల్యే కురుగోండ్ల భేటి



**రాపూరు, అక్టోబరు18ప్రబాతవార్త** తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియ మితులైన రాష్ట రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌నుశుక్రవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ మర్యాద పూర్వకంగా భేటి అయ్యారు. అమరావతిలోనిమంత్రి నివాసంలో ఆయనను కలసిన కురుగోండ్ల రామకృష్ణ తిరు పతి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. తిరుపతి జిల్లాలోని వెంకటగిరి నియోజకవర్గానికి సంబందించి నపలు అభివృద్ధి పనులపై మంత్రితో చర్చించిన ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు.

## రాపూరు మండల పంచాయితీ విస్తరణాధికారిగా బాలకృష్ణా రెడ్డి



**రాపూరు, అక్టోబరు18ప్రభాతవార్త** రాపూరు మండల పంచాయితీ విస్తరణాధికారి ఇన్‌చార్జ్‌గా బాలకృష్ణా రెడ్డి శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇఒపిఆర్‌డీగా పనిచేస్తున్న ఏడుకోండలు ప్రకాశం జిల్లాకు బదిలీ కావడంతోఆయన స్థానంలో కంబాలపల్లి పంచాయితీ కార్యదర్శిగా వున్న బాలకృష్ణా రెడ్డిని ఇన్‌చార్జ్ ఇఒపిఆర్‌డీగా నియమిస్తూయంపీడీఓ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు.

## పారిశుధ్య పనులు పర్యవేక్షించిన యంపీడీఓ భవాని



**రాపూరు, అక్టోబరు18ప్రబాతవార్త** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలో జరుగుతున్న పారిశుధ్య పనులను యంపీడీఓ మారెళ్ల భవానిశుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా హరిజన వాడ, అరుంధతీయ వాడలో జెసిబిల సహాయంతో రోడ్డుమీద పేరుకుపోయిన చెత్తను తోలగించడాన్ని ఆమె పరిశీలించారు. ప్రజలు చెత్తను ఎక్కడబడితే అక్కడ వేయకుండాఒక చోటే వేయాలన్నారు. వర్షాలు వున్నందున అంటు వ్యాధులు ప్రభలకుండా చెత్తను ఎప్పటికప్పుడు తోలగించాలనిఆమె పంచాయితీ కార్యదర్శికి సూచించారు. ఈమె వెంట గ్రామ సర్పంచ్ భూపతి జయమ్మ, జనసేన వీర మహిళ కోండాపురం కస్తూరి, పంచాయితీ కార్యదర్శి చెంచయ్య తదితరులున్నారు.

## మలిదేవి కల్వర్టుపై గుంతలు పూడిపించిన కమీషనర్



**బుచ్చి అక్టోబర్ 18 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణ మలిదేవి కాలువ వంతెన చెన్నూరు ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గుంతలు పడడంతో తరచూ వాహన దారులు ప్రమాదాలకు గురై గాయాలపాలౌతున్నారు. ఈవిషయం నగర్ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి స్పందించారు. కమీషనర్ మున్సిపల్ సిబ్బంది కలిసి జేసిబితో గుంటలు పడిన చోట రోడ్డుపై మట్టి పోసి గుంతలు పూడిపించారు. రోడ్డుపై గుంటలను పూడ్చించిన కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డిని వాహనదారులు స్థానికులు అభినందించారు.